## క్లుప్తంగా

### వైఎస్ జగన్‌పై విమర్శలు దారుణం


వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ చేసిన తీవ్రమైన పదజాలం దారుణమని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రతి ఒక్కరూ హుందాగా వ్యవహరించాలన్నారు. భావి తరాలకు రాజకీయాలు ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. చరిత్రలో బాలకృష్ణ లాంటి ఎంతోమంది అహంకారులు రాజకీయంగా కనుమరుగయ్యారని ఏం చూసుకొని ఈ విధంగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. కూటమి నేతలు భవిష్యత్‌లో ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సంపద తయారీ కేంద్రం పరిశీలన


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో అమ్మాజీ

**ఉంగుటూరు:** గోపీనాథపట్నంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ గురువారం పరిశీలించారు. పంచాయతీ నిర్వహిస్తున్న ఈ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది, సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తితో మాట్లాడారు. డీఎల్‌డీవో అమ్మాజీ కేంద్రం నిర్వహణకు కొన్ని సూచనలు, సలహాలు అందించారు.

### సీఆర్‌పీలకు శిక్షణ

**ఉంగుటూరు:** తడి, పొడి చెత్త ఎలా వేరు చేయాలనే అంశంపై, చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలనే విషయాలపై 5 మండలాల సీఆర్‌పీలకు గురువారం చేబ్రోలులో శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, షెడ్డు ఆవశ్యకత, వర్మి కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. చేబ్రోలు కార్యదర్శి జీడీ శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన శిక్షణలో సర్పంచి రందే లక్ష్మీసునీత, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీడీవో రాజ్ మనోజు, డీఎల్‌డీవో అమ్మాజీ పాల్గొని శిక్షణ ఇచ్చారు.

### సమయ గంట బహూకరణ


సమయ గంటను అందజేస్తున్న కమిటీ సభ్యులు

**పెదపాడు:** మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు సమయ గంటను బహూకరించారు. గంటకో సారి మోగుతూ భగవద్గీత శ్లోకాన్ని చెప్పి ఆ శ్లోకానికి అర్థం వినిపిస్తుంది. గురువారం శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు అభయాంజనేయ స్వామి ఆలయ అర్చకునికి అందించారు. కార్యక్రమంలో తవ్వా పూర్ణచంద్రరావు, నూకల బాలాజీ, నూకల రాఘవరావు, మంచం రాఘవ, అంకంబాబు, వడ్డి విజయ్, అర్చకులు శ్యామ్ సత్యమణి తదితరులు పాల్గొన్నారు.

### నాగ హనుమాన్ గ్రూప్‌నకు అవార్డు

**దెందులూరు:** భారతదేశంలోనే అత్యధిక పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలు కలిగిన రిఫైన్డ్ రైస్ బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి చేసినందుకు మండలంలోని శింగవరంలోని శ్రీ నాగ హనుమాన్ ఆగ్రో ఆయిల్స్, నాగ హనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, నాగ హనుమాన్ ఆగ్రో ఆయిల్స్ సంస్థలకు ప్రతిష్టాత్మకమైన పురస్కారం దక్కింది. ముంబైలో జరిగిన కార్యక్రమంలో బీకే గోయింకా ఎస్ఈఏ అవార్డును గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ నూకల రామకృష్ణ ఆధ్వర్యంలో డైరెక్టర్లు నూకల లక్ష్మణరావు, నూకల బాలాజీ, వైస్ ప్రెసిడెంట్ గురుశేఖర్, టెక్నికల్ డైరెక్టర్ భాస్కర్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును కంపెనీ ఉద్యోగులు, సిబ్బందికి అంకితమిస్తున్నామని యాజమాన్యం తెలిపింది.

### నృసింహునికి పంచామృత అభిషేకాలు


**ద్వారకాతిరుమల:** శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతీని పురస్కరించుకుని ముందుగా ఆలయంలో అర్చకులు, పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధనను నిర్వహించారు. ఆ తరువాత వేద మంత్రోచ్ఛరణల నడుమ సుదర్శన నారసింహ ధన్వంతరీ గరుడ ఆంజనేయ అనంత సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమాలను నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కాత్యాయనీ.. పాహిమాం!

**వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**


భీమడోలు: కాత్యాయనీ దేవిగా భవానమ్మ


ఉంగుటూరు: కాత్యాయనీ అవతారంలో..


నిడమర్రు: సంతాన లక్ష్మి అవతారంలో..

**ఉంగుటూరు:** మండలంలో అమ్మవార్ల ఆలయాలు విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. గురువారం చేబ్రోలు కనకదుర్గమ్మకు కాత్యాయని అలంకారం చేశారు. ఉంగుటూరు చల్లాలమ్మ ఆలయం వద్ద, చిన్న చల్లాలమ్మ ఆలయం వద్ద, తూర్పు కాపుల పేట వద్ద కనకదుర్గమ్మలకు పూజలు చేస్తున్నారు. ఉంగుటూరు భీమేశ్వరస్వామి ఆలయం వద్ద ట్రస్టీ బోర్డు చైర్మన్ నారాయణం హనుమంతురావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు.

**సంతాన లక్ష్మిగా అమ్మవారు**

**నిడమర్రు:** మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆయా ఆలయాల్లో, దుర్గామాత వేదికల వద్ద అమ్మవారిని కాత్యాయనిదేవిగా, సంతాన లక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మందలపర్రు గ్రామంలోని పంచాయతన క్షేత్రంలో కొలువైన ఉమాదేవిని కాత్యాయనిగా అలంకరించారు. ఈ క్షేత్రంలో భక్తుల సహకారంతో రూ.12 లక్షల విలువైన 10 కిలోల వెండితో తయారు చేసిన వెండి కవచం అమ్మవారికి శుక్రవారం ఉదయం అలంకరిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

**వైభవంగా దసరా ఉత్సవాలు**

**గణపవరం:** దేవీ నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. చినరామచంద్రపురం కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. గణపవరం బస్టాండు వద్ద రామాలయం వీధిలో కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాతను కాత్యాయినీదేవిగా అలంకరించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. సువర్ణగుండం చెర్వు వద్ద తోటలో కనకదుర్గాలయం, గణపవరం బాలయ్య చెరువు వద్ద కంచి కామాక్షి కనకదుర్గ ఆలయం, సరిపల్లె కనకదుర్గ ఆలయం పిప్పరలోని కనకదుర్గ అమ్మవారి ఆలయాల వద్ద దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.


దెందులూరు: కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు


గణపవరం: అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

**అన్నపూర్ణాదేవిగా అమ్మవారు**

**భీమడోలు:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నాల్గవ రోజైన గురువారం వైభవోపేతంగా సాగాయి. అమ్మవార్లకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు భవానీ మాతకు విశేష పూజలు చేశారు. భీమడోలు గ్రామంలోని రావిచెట్టు, పోస్టాఫీసు రోడ్డు, భీమడోలు జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం భవానమ్మ ఆలయంలో అమ్మవారు కాత్యాయని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరెడ్లగూడెంలోని గడ్డపై వేంచేసియున్న అమ్మవారికి విశేష పూజలు చేసారు. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని గుండుగొలనులో శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారుల లంకా శివకుమార్‌శర్మ, లంకా శ్రీనివాస్ శర్మల సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**కలశాలతో ఊరేగింపు, కుంకుమ పూజ**

**దెందులూరు:** దసరా మహోత్సవాలు వాడవాడలా వైభవంగా నిర్వహిస్తున్నారు. గోపన్నపాలెం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు కుంకుమ పూజ చేశారు. కలశాలతో గ్రామంలో ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. పోతునూరు హాస్పటల్ పక్కన కనకదుర్గమ్మ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మ్యాజిక్ షో ఏర్పాటు చేశారు.

### సరిహద్దుల నిర్ధారణ

**దెందులూరు:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో మూడు గ్రామాల్లో ప్రభుత్వ భూములకు సరిహద్దులు నిర్ధారించామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో దెందులూరు మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్రతో కలిసి మాట్లాడారు. శింగవరంలో 2005 ఎకరాలు, నాగులదేవునిపాడులో 171 ఎకరాలు, గోపన్నపాలెంలో 123 ఎకరాల్లో ప్రభుత్వ భూములకు సరిహద్దులు నిర్ధారించామన్నారు. మండల సర్వేయర్ రమణారావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

### ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

**దెందులూరు:** ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శాంతకుమారి అన్నారు. గురువారం కొవ్వలి మొటపర్తి భవన్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యం వ్యాధులపై మందుల ప్రభావం సత్ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోతునూరు పీహెచ్‌సీ వైద్యులు చైతన్య, ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్‌రావు, సూపర్‌వైజర్ హరి, పీహెచ్ఎన్ అరుంధతి, సొసైటీ చైర్మన్ అనిల్, కస్కుర్తి రామకృష్ణ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణ

**దెందులూరు:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ రిపేర్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ప్రతినిధి శిరోమణి అన్నారు. గురువారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ ఏలూరులో ఉచితంగా 30 రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 19 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని ఐదో తరగతి ఉత్తీర్ణత పొందాలన్నారు.

# మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



భీమడోలు: ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో పద్మావతిదేవి

**భీమడోలు:** మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, గుండుగొలను వైద్యాధికారిణి శరణ్య అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని సూరప్పగూడెంలో గురువారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశ నుంచి 50 ఏళ్ల వయస్సు గల మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అంగన్‌వాడీల్లో లబ్ధిదారులకు అందిస్తున్న ఆహార పదార్థాల స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, డిప్యూటీ హెచ్ఈవో మధుసూదనరావు, సీహెచ్‌వో ఇందిర, సూపర్‌వైజర్ రామకృష్ణ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**మహిళల ఆరోగ్యానికి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్**

**గణపవరం:** మహిళల ఆరోగ్య రక్షణకు స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకం దోహదపడుతుందని ఈ పథకాన్ని మహిళలు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. గురువారం గణపవరం పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ మూర అలంకారం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆసుపత్రి ప్రత్యేక అధికారిణి, ఎంపీడీవో బేబీశ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని, అలా కాకుండా ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం 280 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రసూతి వైద్యనిపుణురాలు కీర్తన, ఆప్తాలమిక్ అధికారి ఐ.శ్రీనివాస్, తోటశ్రీను, సిహెచ్‌వో జాలాది విల్సన్ తదితరులు పాల్గొన్నారు.


పెదపాడు: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


గణపవరం: మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది

**పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం**

**పెదపాడు:** ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు సూచించారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు గుడూరు రామలింగేశ్వరరావు, బొత్సశేఖర్, బీరయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రెయిన్ల పూడికతీత పనులు ప్రారంభం


డ్రెయిన్‌లో జేసీబీ సాయంతో చేస్తున్న పూడికతీత పనులు

**భీమడోలు:** భీమడోలు పంచాయతీ అరుంధతీ కాలనీలో కచ్చా డ్రెయిన్ల పూడికతీత పనులు గురువారం ప్రారంభించారు. వర్షాకాలం వస్తే కాలనీలోని రోడ్లు పల్లంగా ఉండడంతో ఆ ప్రాంతం నీటితో నిండిపోతుంది. దీనికి తోడు డ్రెయిన్లలో పూడిక తీయకపోవడం, కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆ ప్రాంత వాసులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో జేసీబీ సాయంతో కాలనీలోని ఇరువైపులా డ్రెయిన్లు తీయడం, పలు చోట్ల పూడిక తీయడం వంటి పనులు చేపట్టారు. గ్రామ కార్యదర్శి కేవీఎల్ తనూజ ఆధ్వర్యంలో ఈ పనులు సాగిస్తున్నారు. కార్యక్రమంలో ఎంసీ చైర్మన్ శేషగిరి, పెద్దలు ప్రత్తి మదన్, కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, ఈతకోట సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన


డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్

**భీమడోలు:** రైతులు తమ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, తద్వారా సంక్షేమ పథకాల లబ్ధి ఆ ఖాతాల్లో జమ అవుతుందని భీమడోలు డీసీసీబీ మేనేజర్ ఓబిలిశెట్టి రమేష్ అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామంలో గురువారం సాయంత్రం రైతులకు డిజిటల్ అక్షరాస్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీలు, బ్యాంకుల ఇన్సూరెన్స్ పథకాలు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. సొసైటీ చైర్మన్ వట్టి నారయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంకు మేనేజర్ ఓబిలిశెట్టి రమేష్ మాట్లాడుతూ రైతులు ప్రతి ఆరు నెలలకో సారి ఖాతాల్లో నగదు లావాదేవీలు చేస్తే ఖాతా యాక్టివ్‌గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.రామకృష్ణ, వడ్డి సత్తులు, సొసైటీ సిబ్బంది బి.శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ పి.లక్ష్మీ సుజన, రైతులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతే దీన్ దయాళ్ ఆశయం


పంచాయతీ కార్మికులను సత్కరిస్తున్న రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ

**ఉంగుటూరు:** పేదలకు ప్రభుత్వ పథకం చేరాలనేది ధీన్ దయాళ్ ఆశయమని, పేదల అభ్యున్నతికి ఆయన పోరాటం చేసేవారని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ అన్నారు. గురువారం చేబ్రోలులో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి, సేవా పక్షోత్సవాల్లో బాగంగా దీన్ దయాళ్ విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో రాజ్‌మనోజు, సర్పంచి రందే లక్ష్మీసునీత తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక ఉత్పత్తులనే వాడాలి**

**పెదపాడు:** స్థానిక ఉత్పత్తులనే వాడాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యన్నారాయణ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ జీవితంపై సెమినార్ నిర్వహించారు. ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా అధ్యక్షుడు విక్రం కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

**పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ**

**దెందులూరు:** పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవ అందరికంటే గొప్పదని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం మండల బీజేపీ అధ్యక్షురాలు చీకటి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో భీమరాజు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పినిపోయిన మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారం

**కొయ్యలగూడెం:** ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత ప్రచారం చేయవలసిన బాధ్యత వైద్య ఆరోగ్య శాఖతో పాటు అవగాహన కలిగిన ఎన్జీవోలపై ఉందని ఎంపీహెచ్‌వో ఎల్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం సీతంపేట సచివాలయం వద్ద ఏలూరు, జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 58 మంది మహిళలకు సిఫిలిస్, హెచ్ఐవీ, హిమోగ్లోబిన్, డయాబెటీస్ పరీక్షలు చేశారు. సురేష్‌బాబు, కౌన్సిలర్ బి.హనుమంతు, సిఫిలిస్ పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగలతో జాగ్రత్త

**ఉంగుటూరు:** అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ కోరారు. ఇటీవల ఉంగుటూరు మండలం సరిహద్దు ప్రాంతాల్లో దొంగతనాలు జరిగిన నేపథ్యంలో ఈ విషయం వెల్లడించాల్సి వస్తుందని తెలిపారు. బయట వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే సమాచారం ఇవ్వాలని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**భీమడోలు:** భీమడోలు పరిసర ప్రాంతాల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలులో విలేకరులతో ఆయన గురువారం రాత్రి మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన నెల్లూరు జిల్లాలోని కావలి టూ టౌన్‌లో, 23న కాకినాడ జిల్లా పత్తిపాడులో ఓ గోల్డ్ దుకాణంలో, తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల ఓ ఇంట్లో దొంగతనాలు చేశారన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తే వెంటనే 112కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


ముత్యాలమ్మ అభిషేకానికి బిందెలతో నీరు తెస్తున్న మహిళలు

**బుట్టాయగూడెం:** మండలంలోని నాగులగూడెంలో గ్రామ దేవత, ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బిందెలతో నీటిని తీసుకొచ్చారు. అనంతరం పురోహితులు అనిపెద్ది విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో పురోహితులు అమ్మవారి, పోతురాజు విగ్రహాలకు అభిషేకం, క్షీరాభిషేకం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి కార్యక్రమంతో పాటు మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సరియం వెంకటేశ్వరరావు, చోడెం నాగేంద్రబాబు, మడకం మంగరాజు, కొవ్వాసు కృష్ణ, కొవ్వాసు బాబూరావు, కట్టం శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

# గుంతల రహదారితో ప్రజల అవస్థలు వర్ణనాతీతం


అధ్వానంగా ఉన్న సూర్పవారిగూడెం రోడ్డు


పడమర రేగులకుంట సమీపంలో అధ్వానంగా ఉన్న రహదారి

**బుట్టాయగూడెం:** మండలంలో రామారావుపేట సెంటర్ నుంచి పందిరిమామిడిగూడెం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుబ్బల మంగమ్మగుడికి వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధానంగా ఉంది. ఈ రోడ్డు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా తయారవ్వడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. వేపులపాడు, బూరుగువాడ, పందిరిమామిడిగూడెం, కామవరం, నాగులగూడెం గ్రామాల నుంచి ప్రజలు పలు అవసరాల నిమిత్తం నిత్యం ఈ రోడ్డుపైనే ప్రయాణించాల్సి ఉంటుంది. అలాగే అత్యధికంగా వ్యవసాయ భూములు కూడా ఉండడంతో కూలీలు, రైతులు ఈ రహదారిపైనే ప్రయాణం చేస్తుంటారు. ప్రస్తుతం వర్షాల కారణంగా గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రయాణం చేయాలంటే మరింత కష్టంగా మారింది. రాత్రుళ్ల ప్రయాణం చేయాలంటే ఇబ్బందికరంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నా ఈ రోడ్ల గురించి కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు కనీస మరమ్మతులు చేయించి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా పందిరిమామిడిగూడెం నుంచి కామవరం వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వర్షపునీరు చేరుకుని చెరువుల్లా కనిపిస్తున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.